సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శనివారం । 4 । మే । 2024



రూ.50,116 విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు సీరం వెంకట నాంచారయ్య దంపతులు (చల్లపల్లి) శుక్రవారం రూ.50,116 విరాళం సమర్పించారు.



... వైఎస్సార్ సీపీ విజయానికి కృషి

ఉభయ గోదావరి జిల్లాల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేస్తామని ఆ పార్టీ ఉభయ గోదావరి ఎన్ఆర్ఐ బస్సు యాత్ర ఇన్చార్జి కార్తీక్ యల్లాప్రగడ అన్నారు. - 10లో ▸

గరిష్టం/కనిష్టం
41.0° / 28.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	41.0	28.0
కాకినాడ	39.0	29.4
అమలాపురం	40.5	28.0

న్యూస్‌రీల్

10 నుంచి పంట కాలువలకు నీటి సరఫరా నిలిపివేత



చీఫ్ ఇంజినీర్ సతీష్‌కుమార్

అమలాపురం రూరల్: గోదావరి డెల్టా పరిధిలో గల పంట కాలువలకు రబీ సీజన్ 2023–24కు సంబంధించి సాగునీటి సరఫరా ఈ నెల 10వ తేదీ సాయంత్రం 6.00 గంటలకు నిలుపుదల చేస్తామని గోదావరి డెల్టా సిస్టం ధవళేశ్వరం చీఫ్ ఇంజినీర్ సతీష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టా ప్రధాన కాలువల పరిధిలో గల వరిపంట, తాగునీటి అవసరాలు చివరి స్థాయికి చేరుకున్నందున పంట కాలువలకు నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఈ వారం రోజులలో కాలువల పరివాహ ప్రాంతాలలో ఉన్న గ్రామాలకు చెందిన వారు వేసవి రక్షిత సమ్మర్ స్టోరేజ్ చెరువులను పూర్తి స్థాయిలో నింపుకోవాలని ఆయన ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

పవన్, చంద్రబాబు నట్టేట ముంచేస్తారు

- అబద్ధాలు చంద్రబాబుకు అలవాటే..
- పవన్‌ను పిఠాపురంలో ఓడించాలి
- ముద్రగడ పిలుపు



పిఠాపురంలో మాట్లాడుతున్న ముద్రగడ

పిఠాపురం: పవన్‌ను, చంద్రబాబును నమ్మితే నట్టేట ముంచేస్తారని మాజీ మంత్రి వైఎస్సార్ సీపీ నేత ముద్రగడ పద్మనాభం అన్నారు. పిఠాపురంలో ఎన్నికల ప్రచారంపై వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత, ఎమ్మెల్యే పెండెం దొరబాబుతో శుక్రవారం ఆయన చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తప్పుడు హామీలతో జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి సభ్యులు వస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఎన్నికలయ్యేంత వరకే చంద్రబాబు జిమ్మిక్కుల మేనిఫెస్టో ఉంటుందని, ఎన్నికలయ్యాక దానిని మూసివేస్తారని చెప్పారు. సినీ నటుడు పవన్ కల్యాణ్ ప్రజలను మోసం చేసే మేనిఫెస్టోతో, ఊకదంపుడు ప్రసంగాలతో ప్రజలను మోసం చేయడానికి ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అధికారం కోసం అబద్ధాలు చెప్పడం చంద్రబాబుకు అలవాటేనన్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా గడచిన ఐదేళ్లలో సీఎం వైఎస్ జగన్ సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని గుర్తు చేశారు. పిఠాపురంలో పవన్ కల్యాణ్‌ను ఓడించాలని ముద్రగడ పిలుపునిచ్చారు. ఎంత మంది సినీ నటులు ప్రచారం చేసినా పిఠాపురం ప్రజలు ఇచ్చే తీర్పు మాత్రం వైఎస్సార్ సీపీకేనని స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులకు, కార్యకర్తలకు ముద్రగడ పిలుపునిచ్చారు. వంగా గీత, ఎమ్మెల్యే పెండెం దొరబాబు మాట్లాడుతూ, పిఠాపురంలో వైఎస్సార్ సీపీ విజయం ఖాయమని అన్నారు. ప్రజలందరు వైఎస్సార్ సీపీనే కోరుకుంటున్నారన్నారు. ముద్రగడ నీతి నిజాయితీ కలిగిన నాయకుడని, ఆయన పదవుల కోసం పార్టీలోకి రాలేదని చెప్పారు. రెండు నెలలుగా పిఠాపురంలో వంగా గీత విజయం కోసం ముద్రగడ పూర్తి స్థాయిలో పని చేస్తున్నారన్నారు.

ఆరోగ్యమస్తు

- పేదల వైద్యానికి పెద్ద పీట
- ఆరోగ్యశ్రీకి తోడు మరెన్నో పథకాల అమలు
- నుస్తీ చేస్తే అందుబాటులో ఫ్యామిలీ డాక్టర్
- రోగమొస్తే చేతిలో రూ.25 లక్షల ఆరోగ్యశ్రీ కార్డు
- జగనన్న ఆరోగ్య సురక్షతో అందరికీ వైద్య పరీక్షలు
- నిర్మాణంలో ప్రభుత్వ వైద్య కళాశాల
- బోధనా ఆస్పత్రిగా మారనున్న అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి



జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

అమలాపురం టౌన్: పేద ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇవ్వడంపై జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పథకాలు ప్రవేశ పెట్టి, చిత్తశుద్ధితో అమలు చేయడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో మరిన్ని రోగాలను చేర్చి, చికిత్సకు అయ్యే ఖర్చు మొత్తాన్ని పెంచి రోగమొస్తే ప్రభుత్వం అండగా ఉందనే ధైర్యం కల్పించారని చెబుతున్నారు. ఆరోగ్యశ్రీ, జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ఇలా పలు పథకాలు ప్రజల ఆరోగ్యానికి అండగా నిలుస్తున్నాయి. దీనికితోడు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి దీర్ఘకాల రోగులకు సాయం అందిస్తున్నారు. వైద్య ఖర్చులు ఎంతైనా చెల్లిస్తున్నారు. ఇది జిల్లాలోని ఎందరికో ఆరోగ్య అభయాన్ని ఇచ్చింది.

ఆరోగ్యశ్రీ కార్డు ఉంటే రూ.25 లక్షలు చేతిలో ఉన్నట్టే..

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రవేశపెట్టిన పేదల ఆరోగ్య పెన్నిధి ఆరోగ్యశ్రీ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం మరింతగా మెరుగులు దిద్దింది. ఈ పథకంలో ఇప్పటికే ఉన్న 1,059 వైద్య సేవలను (రోగాలను) 3,257కి ఒకేసారి పెంచింది. ముఖ్యంగా ఎవరైనా రోగి ఆరోగ్యశ్రీ ద్వారా నెట్‌వర్క్ ఆస్పత్రికి వెళితే రూ.5 లక్షల వరకూ వైద్య ఖర్చుల పరిమితి ఉండేది. అయితే ఇప్పుడు ఆ పరిమితిని రాష్ట్ర ప్రభుత్వం **ఏకంగా రూ.25 లక్షలకు పెంచింది. అంటే ఆరోగ్యశ్రీ కార్డు చేతిలో ఉంటే రూ.25 లక్షలతో చేతిలో ఉన్న ఏటీఎం కార్డుతో సమానం. ఆరోగ్యశ్రీ పథకం కొత్త ఫీచర్లతో జిల్లాలో 5,32,517 అర్హులకు స్మార్ట్‌కార్డుల పంపిణీ జరిగింది.** జిల్లాలో ఉన్న 18 ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల ద్వారా గడచిన అయిదేళ్లలో 2.40 లక్షల మంది రోగులకు రూ.623 కోట్లకు పైగా ఈ పథకం కింద ప్రభుత్వం ఖర్చు చేసింది.

త్వరలో అందుబాటులోకి ప్రభుత్వ వైద్య కళాశాల

ఇంతకాలం ప్రైవేటు వైద్య కళాశాల, బోధనా ఆస్పత్రిపై ఆధారపడ్డ జిల్లా పేద ప్రజానీకానికి త్వరలోనే అమలాపురం సమీపంలో ప్రభుత్వం నిర్మిస్తున్న వైద్య కళాశాల అందుబాటులోకి రానుంది. 54 ఎకరాల విస్తీర్ణంలో రూ.450 కోట్లతో అమలాపురం రూరల్ మండలం కామనగరువు, సమనస గ్రామాల సరిహద్దుల్లో నిర్మితమవుతున్న ప్రభుత్వ వైద్య కళాశాల పనులు దాదాపు 60 శాతం పూర్తయ్యాయి.

బోధనా ఆస్పత్రిగా రూపాంతరం చెందుతున్న ఏరియా ఆస్పత్రి

అమలాపురంలో కోనసీమ పేద ప్రజల పెద్దాసుపత్రిగా సేవలు అందిస్తున్న 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి... ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుబంధంగా బోధనా ఆస్పత్రి కానుంది. 650 పడకల ఆస్పత్రిగా మారబోతోంది. ఇప్పటికే నాడు–నేడు పథకం కింద రూ.5.70 కోట్లతో ఏరియా ఆస్పత్రి భవనాన్ని, అన్ని వైద్య విభాగాలను ఆధునీకరించారు. ఈ సంవత్సరాంతానికి వైద్య కళాశాల, బోధనా ఆస్పత్రి జిల్లా ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి.

ప్రాణభిక్ష పెట్టిన వైనం

దీర్ఘకాలిక రోగులు, వారి కుటుంబీకులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అందుతున్న సాయం బాధితులకు ప్రాణభిక్ష పెడుతోంది. బాధితుల ఆరోగ్య సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళితే వెంటనే స్పందించి వారి వైద్యానికయ్యే ఖర్చు ఎంతో మొత్తమైనా సరే చెల్లిస్తూ వారిలో ధైర్యం నింపుతోంది. సీఎం సహాయ నిధి ఎందరో రోగులకు ఆరోగ్య అభయాన్ని ఇచ్చింది. అల్లవరం మండలం నక్కా రామేశ్వరానికి చెందిన చిన్నారి హనీ అరుదైన గాకర్స్ వ్యాధి బారిన పడినప్పుడు ఆ చిన్నారి వైద్యానికి ప్రభుత్వం రూ.కోటి కేటాయించింది. అతి ఖరీదైన ఇంజెక్షన్లు చేయించి హనీకి ప్రాణ భిక్ష పెట్టింది. తమ బిడ్డకు ప్రాణం పోసింది ప్రభుత్వమేనని తల్లిదండ్రులు కొప్పాడి రాంబాబు, నాగలక్ష్మి కృతజ్ఞతాపూర్వకంగా అందరికీ చెబుతున్నారు.



అమలాపురంలో ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణం



అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి

నా బిడ్డను బతికించింది ప్రభుత్వమే



అరుదైన వ్యాధితో బాధపడుతున్న నా బిడ్డ హనీ నేడు బతికి ఉందంటే అది రాష్ట్ర ప్రభుత్వం పుణ్యమే. నా భర్త, కుమార్తె హనీ ప్రభుత్వం దృష్టికి మా బిడ్డ బాధ తెలియజేయడం వల్లే వైద్యానికి రూ.కోటి మంజూరైంది. ఈ రోజు మా పాప.. ప్రభుత్వం అందిస్తున్న వైద్యంతోనే ఆరోగ్యంగా, చలాకీగా తిరుగుతోంది. రూ.లక్షల్లో అయ్యే వైద్య ఖర్చులు భరించడం మా పేద కుటుంబం తరం కాదు. అందుకే మా కుటుంబ పాలిట ఈ ప్రభుత్వం ఆపద్బాంధవి అయింది. అంతేకాదు మా బిడ్డలకు కార్పొరేట్ స్థాయి విద్యను, నెలకు రూ.10 వేలు పింఛన్ ప్రభుత్వం అందిస్తోంది.

– కొప్పాడి నాగలక్ష్మి, హనీ తల్లి,
నక్కా రామేశ్వరం, అల్లవరం మండలం

జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష వివరాలు

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు	– 480
పరీక్షలు చేయించుకున్న రోగులు	– 1.15,122
వివిధ శస్త్ర చికిత్సలకు రిఫర్ చేసిన రోగుల సంఖ్య	– 563
కంటి వెలుగు ప్రోగ్రామ్‌లో కళ్లజోళ్ల పంపిణీ	– 41,411
క్యాటరాక్ట్ శస్త్ర చికిత్సలు	– 2,017
సురక్ష వైద్య శిబిరాల్లో స్క్రీనింగ్ చేసిన కంటి రోగులు	– 9,380
ఎన్‌సీడీ సర్వే ద్వారా హైపర్ టెన్షన్ రోగులు	– 1,63,889
డయాబిటిస్ (సుగర్) రోగులు	– 1,07,053
డయాబిటిస్, హైపర్ టెన్షన్ రోగులు	– 70,491

ఫ్యామిలీ డాక్టర్ ద్వారా...

వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్	– 452
వైద్యం పొందిన గర్భిణులు	– 11,738
బాలింతలు	– 2,061
రక్తహీనత ఉన్న గర్భిణులు	– 263

ఆ పేద గుండె బతికిందంటే ఆరోగ్యశ్రీ వల్లే



నాకు గుండె వ్యాధి రాగానే వైద్యుణ్ణి సంప్రదించాను. గుండెకు ఆపరేషన్ అత్యవసరంగా చేయాలి అన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఆపరేషన్ చేయించుకున్నాను. దాదాపు రూ.లక్ష వ్యయంతో కూడిన ఆ ఆపరేషన్‌ను నేను ఉచితంగా పొందానంటే ఆరోగ్యశ్రీ వల్లే. రెండు నెలల కిందట ఆపరేషన్ చేయించుకున్నాను. నా ఆరోగ్యం బాగానే ఉంది. నేను బతికి ఉన్నానంటే ఆరోగ్యశ్రీయే కారణం.

– నేతల సత్యనారాయణ,
చిరుతపూడి, అంబాజీపేట మండలం

విశ్వ బ్రాహ్మణులు, స్వర్ణకారుల సంక్షేమానికి పెద్ద పీట



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి విశ్వరూప్. చిత్రంలో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అమలాపురం టౌన్: విశ్వ బ్రాహ్మణులు, స్వర్ణకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేసి వారి అభ్యున్నతికి పాటు పడుతోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి పినిపే విశ్వరూప్ అన్నారు. అమలాపురంలోని విశ్వ బ్రాహ్మణ కమ్యూనిటీ హాలులో పట్టణ విశ్వ బ్రాహ్మణ, స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటైన సభలో మంత్రి విశ్వరూప్ ముఖ్య అతిథిగా ప్రసంగించారు. రాష్ట్ర సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కట్బోజు సన్న్యయ్యదాసు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం తొలుత తమ సంఘం భవనం పై అంతస్తు నిర్మాణానికి మంత్రి విశ్వరూప్ రూ.10 లక్షలు నిధులు విడుదల చేసినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపింది. జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అయ్యే దిశగా, మంత్రి విశ్వరూప్ మరోసారి ఎమ్మెల్యేగా గెలిచి మళ్లీ రాష్ట్ర మంత్రి అయ్యేలా పట్టణంలోని విశ్వ బ్రాహ్మణులు, స్వర్ణకారులు కృషి చేస్తామని సమావేశంలో పాల్గొన్న సంఘ ప్రతినిధులు తమ ప్రసంగాల్లో స్పష్టం చేశారు. మరో అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో విశ్వ బ్రాహ్మణులకు జరిగిన లబ్ధిని వివరించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర, జిల్లా, పట్టణ ప్రతినిధులు ర్యాలి రాజశేఖర్, దార్ల పాపయ్యాచారి, భరణకాన బాబు, తాళాబత్తుల లక్ష్మణరావు, కట్బోజు రాము ప్రసంగించారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్, చిట్టూరి పెదబాబు, దొమ్మేటి రాము, కౌన్సిల్ కో ఆప్షన్ సభ్యుడు వంకాయల కాశి, మద్దింశెట్టి ప్రసాద్ పాల్గొన్నారు.

కోడ్‌కు అనుగుణంగా పనిచేయాలి

అధికారులకు కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశం



అమలాపురం రూరల్: ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిపై ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు అమల్లో ఉంటుందన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిపై శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గాలలో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించరాదని, అధికారిక పర్యటనలతో ఎన్నికల పర్యటనలను జోడించరాదన్నారు. నియమావళి అమల్లో ఉన్నంతకాలం ఓటర్లను ప్రభావితం చేసే కొత్త ప్రకటనలు జారీ చేయకూడదన్నారు. ఎన్నికల విధులలో నియమితులైన అధికారులు మంత్రుల సమావేశాల హాజరు కాకూడదన్నారు. మంత్రులు ఎన్నికల ప్రచారాలకు ప్రభుత్వ, పైలెట్ వాహనాలను వినియోగించరాదన్నారు. మంత్రులు, రాజకీయ నేతల పర్యటనలను ప్రత్యేక వీడియో బృందాలు చిత్రీకరిస్తున్నాయని, వీటిని ఎన్నికల పరిశీలకులు ప్రతి రోజూ పరిశీలించి కోడ్ ఉల్లంఘనలపై ఎన్నికల సంఘానికి నివేదిస్తారన్నారు. సాధారణ ఎన్నికలు సజావుగా శాంతియుత వాతావరణంలో జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఓటరు ఎవరికి ఓటు వేశారో ఓటరుకు తప్ప, వేరే ఎవరికీ తెలిసే అవకాశం లేకుండా వీవీ ప్యాట్లను ఏర్పాటు చేశామన్నారు. ఓటర్లు ఎవరికీ భయపడకుండా నచ్చిన అభ్యర్థికి స్వేచ్ఛగా ఓటు వేసి ప్రజాస్వామ్య వ్యవస్థను పటిష్ట పరచాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో వీడియో కెమెరాలు వెబ్ కాస్టింగ్ చిత్రీకరణ ఉంటుందన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు, సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద సాయుధ రిజర్వ్ పోలీస్ సిబ్బంది పహారా కాయడంతో పాటు సూక్ష్మ పరిశీలకులు నిశితంగా పోలింగ్ సరళిని పరిశీలిస్తారన్నారు. పోలింగ్ సమయంలో ఎన్నికల సిబ్బంది పోలింగ్ ఏజెంట్లు, సూక్ష్మ పరిశీలకులతో కలసి మాక్ పోలింగ్ 50 ఓట్లతో అన్ని బటన్లు నొక్కి చేస్తారని ఆయన తెలిపారు. మాక్ పోల్ చేసిన 50 ఓటర్లను తొలగించి వీవీ ప్యాట్లో స్లిప్పులు కూడా తొలగించి క్లియర్ చేయాలని స్పష్టం చేశారు. ఈవీఎంలలో సాంకేతిక లోపాలను పరిష్కరించేందుకు ఇంజినీర్లు అందుబాటులో ఉంటారని లేదా వేరే యంత్ర పరికరాన్ని సమకూరుస్తారన్నారు. 12 రకాల గుర్తింపు కార్డులలో ఏదో ఒక దానిని చూపి ఓటు సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 13వ తేదీన ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తామన్నారు. పోలింగ్ సరళిపై జరిగే వీడియో చిత్రీకరణను జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయానికి అనుసంధానం చేసి పర్యవేక్షిస్తామన్నారు.

ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రం పరిశీలన



కలెక్టరేట్‌లో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేశ్వర్ గోయల్

అమలాపురం రూరల్: ఎన్నికల సీజర్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను పకడ్బందీగా అమలు చేసేందుకు సమాచార, నిఘా ఆధారిత ఎన్‌ఫోర్స్‌మెంట్ కీలకమని ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేశ్వర్ గోయల్ పేర్కొన్నారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో కోనసీమ జిల్లాలో అమలాపురం లోక్‌సభ, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన సాధారణ పరిశీలకులు, రాజేశ్వర్ గోయల్, పరదీప్ కుమార్ శుక్రవారం కలెక్టరేట్‌లో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని సందర్శించారు. సీ–విజిల్, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఐటీ, బ్యాంకింగ్, కమర్షియల్ ట్యాక్స్, ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, కస్టమ్స్ తదితర విభాగాల కార్యకలాపాలను పరిశీలించారు. ఓటరు హెల్ప్ లైన్ 1950, నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్, వాట్సప్, కాల్ సెంటర్, కంప్లయింట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, సీఈవో మెయిల్స్, సీ విజిల్స్ తదితరాల ద్వారా అందిన ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను రికార్డుల ఆధారంగా పరిశీలించారు. చెక్ పోస్టుల వద్ద నిఘా అమలు తీరుపై ఆరా తీశారు. స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్, ఫ్లయింగ్ స్క్వాడ్స్ క్షేత్ర స్థాయిలో పరిశీలనకు సంబంధించి ఆయా వాహనాలకు అమర్చిన జీపీఎస్ పరికరాల ద్వారా ఆయా వాహనాలు ఎక్కడ ఉన్నాయి. ఆయా నిఘా బృందాల కదలికలను పరిశీలించే కంట్రోల్ రూమ్ నిర్వహణ తీరును పరిశీలించారు. పోటీలోని అభ్యర్థుల రాజకీయ ప్రకటనలు, చెల్లింపు వార్తల రికార్డింగ్ విధానాలను పరిశీలించారు. రోజువారీ నివేదికల నిర్వహణ తీరును తనిఖీ చేశారు. ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలు, ఐటీ బ్యాంకింగ్ కమర్షియల్ టాక్స్, సీజర్ మేనేజ్‌మెంట్ తదితర విభాగాల కార్యకలాపాలను రికార్డుల ద్వారా పరిశీలించి సిబ్బందికి ఉన్న అవగాహనపై సంతృప్తిని వ్యక్తం చేశారు. వ్యయ పరిశీలకులు ఉమేష్ కుమార్, సుమిత్‌దాస్ గుప్తా, సీ విజిల్ యాప్ నోడల్ అధికారి వెంకటేశ్వర్లు, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

6న ప్రధాని మోదీ సభ

రాజమహేంద్రవరం సిటీ: ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం వేమగిరి వద్ద జాతీయ రహదారిని ఆనుకుని జరిగే విజయ శంఖారావం బహిరంగ సభలో పాల్గొంటారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 3.30 గంటలకు సభలో ప్రసంగిస్తారన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌కు వేళాయె

- ఓటు హక్కు వినియోగించుకోనున్న 13,582 మంది
- అత్యవసర సర్వీసు ఓటర్లు 1,027 మంది
- హోమ్ ఓటింగ్‌కు 1,251 మంది దరఖాస్తు
- నేడు జిల్లావ్యాప్తంగా పోలింగ్ సిబ్బందికి రెండో విడత శిక్షణ

రాయవరం: సార్వత్రిక ఎన్నికలు ఈ నెల 13న జరగనున్నాయి. జిల్లాలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల విధులు నిర్వహించనున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు ఓటు హక్కు ముందుగానే వినియోగించుకోనున్నారు. ఇందుకోసం ఎన్నికల సంఘం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు వారు ఓటుహక్కును సద్వినియోగం చేసుకునే అవకాశాన్ని కల్పించింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఏడు ప్రత్యేక ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేశారు. ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా ప్రతి ఉద్యోగ, ఉపాధ్యాయుడు తమ నియోజకవర్గ పరిధిలో ఓటు వేసేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు. మొదటి విడత శిక్షణ పొందిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి ఓటుహక్కు కల్పించారు. ఒక జిల్లాలో పనిచేస్తూ ఇతర జిల్లాలోని నియోజకవర్గ పరిధిలో ఓటు హక్కు వినియోగించుకునే వారికి ప్రత్యేకంగా ఒక రోజు సెలవు ప్రకటించారు.

శత శాతం నమోదయ్యేలా..

పోస్టల్ బ్యాలెట్ వినియోగంలో గతంలో జరిగిన పొరపాట్లకు ఏమాత్రం తావివ్వకుండా ఎన్నికల కమిషన్ ఈసారి ప్రత్యేక దృష్టి సారించింది. గతంలో పోస్టల్ బ్యాలెట్ కోసం ఉద్యోగులు దరఖాస్తు చేసుకునేవారు. అవగాహన రాహిత్యంతో కొందరు, తమకు ఎందుకనే భావనతో కొందరు దరఖాస్తు చేసుకునేవారు కాదు. దరఖాస్తు చేసుకున్నా పోస్టల్ బ్యాలెట్ రాక పలువురు ఓటు హక్కు కోల్పోయిన సందర్భాలు గతంలో చోటు చేసుకున్నాయి. వీటన్నింటిని గుర్తించిన ఎన్నికల కమిషన్ ఈసారి ఎన్నికల శిక్షణకు ముందే ట్రైనింగ్ ఆర్డర్ కాపీతో పాటు ఉద్యోగుల వివరాలతో కూడిన ఫారం 12ను అందజేసింది. కోనసీమ జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 13,582 మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎన్నికల విధులు నిర్వహించనున్నారు. వీరు శిక్షణ సమయంలో 12 ఫారంతో పాటు ఓటర్ గుర్తింపు కార్డు జిరాక్స్ ప్రతిని జత చేసి, వారు ఏ నియోజకవర్గ పరిధిలో ఓటు వేయాలనుకుంటున్నారు తెలియజేయాల్సి ఉంది. దీని ద్వారా పోస్టల్ బ్యాలెట్ జారీ చేయనుండడంతో ఎన్నికల విధులు నిర్వహించే ప్రతి ఉద్యోగి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఏర్పడింది.

ప్రత్యేక ఏర్పాట్ల మధ్య...

పోస్టల్ బ్యాలెట్‌ను ఈ నెల 5నుంచి 7వ తేదీ వరకు వినియోగించుకునే అవకాశం ఎన్నికల కమిషన్ కల్పించింది. పార్లమెంట్ పరిధిలోని ఏడు ఫెసిలిటేషన్ కేంద్రాల్లో ఇందుకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కంపార్ట్‌మెంట్లతో పాటు పోలింగ్ సిబ్బందిని నియమించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు భద్రతా సిబ్బందిని కేటాయించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ వీలును బట్టి ఆయా తేదీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఎక్కడ ఓటు హక్కు ఉందో అదే నియోజకవర్గ పరిధిలోని ఫెసిలిటేషన్ కేంద్రంలో వినియోగించుకోవచ్చు.

హోమ్ ఓటింగ్‌కు ఏర్పాట్లు

85 ఏళ్ల వయసు పైబడిన వయోవృద్ధులు, 40 శాతానికి మించి వైకల్యమున్న దివ్యాంగులు ఇంటి నుంచే ఓటు వేసేలా ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. ఇందుకోసం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో 85 ఏళ్ల వయసు పైబడిన వారు, 40 శాతం కంటే వైకల్యం కలిగిన దివ్యాంగులు 1,251 మంది ఉన్నారు. ఈసీ ఆదేశాల మేరకు వీరందరికీ బీఎల్‌ఓల ద్వారా 12డి ఫారాలు అందజేశారు. ఎన్నికల సిబ్బంది, పోలీస్ కానిస్టేబుల్, ఓ వీడియో గ్రాఫర్ వారిళ్ల వద్దకే వెళ్లి వారు ప్రత్యేకంగా ఏర్పాటు చేసే ఓటింగ్ కంపార్ట్‌మెంట్ ద్వారా ఓటు నమోదు చేయనున్నారు. అత్యవసర సర్వీసు ఓటర్లుగా 1,027 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. చాలామంది ఇంటి వద్ద ఓటు వేసేందుకు ఆసక్తి చూపలేదు. ఉద్యోగులను తరలించే వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ సిస్టం ఏర్పాటు చేశారు.

పోలింగ్ సిబ్బందికి నేడు శిక్షణ

జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజకవర్గ కేంద్రాల పరిధిలో పోలింగ్ సిబ్బందికి రెండవ విడత శిక్షణ ఇవ్వనున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1,644 పోలింగ్ బూత్‌లకు రిజర్వు సిబ్బందితో పాటు 13,582 మంది సిబ్బందిని పోలింగ్ విధులకు నియమించారు. వీరందరికీ రెండవ విడత శిక్షణ శనివారం ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో ఇవ్వనున్నారు.



పోలింగ్ సిబ్బందికి శిక్షణ

పోస్టల్ బ్యాలెట్, సర్వీసు ఓటర్లు, హోమ్ ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు..

నియోజకవర్గం	ఫారమ్–12	ఫారమ్12డి	హోమ్‌ఓటింగ్	మొత్తం
రామచంద్రపురం	2,373	155	65	2,593
ముమ్మిడివరం	1,741	172	172	2,085
అమలాపురం	2,174	193	109	2,476
రాజోలు	2,035	132	161	2,328
గన్నవరం	1,850	174	421	2,445
కొత్తపేట	1,459	128	63	1,650
మండపేట	1,950	73	260	2,283
మొత్తం	13,582	1,027	1,251	15,860

క్లుప్తంగా

స్నానానికి దిగి ఇద్దరు మృత్యువాత

మృతులు వానపల్లికి చెందిన **యువకులు**



లభ్యమైన మృతదేహాలు

కపిలేశ్వరపురం: స్థానిక గ్రామ శివారు నారాయణలంక వద్ద గౌతమి గోదావరి నదిలో స్నానానికి దిగిన ఇద్దరు యువకులు మృత్యువాత పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కొత్తపేట మండలం వానపల్లిలోని మాలకొండయ్యనగర్‌కు చెందిన కంఠంశెట్టి ప్రసన్నకుమార్ (25), రాజోలు మండలం కేశనపల్లికి చెందిన యనమల సతీష్ (23) నదిలో ప్రమాదవశాత్తూ పడి మృతి చెందారు. ప్రసన్నకుమార్ భవన నిర్మాణ కార్మికుడు కాగా, సతీష్ చదువు పూర్తి చేసుకుని వానపల్లిలోని అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. వానపల్లిలోని మాలకొండయ్య నగర్‌కు చెందిన ముగ్గురు, అదే గ్రామంలోని నారాయణపురానికి చెందిన మరో ముగ్గురు మొత్తం ఆరుగురు నదిలో స్నానానికి దిగారు. కాగా ప్రసన్నకుమార్, సతీష్‌లు మృతి చెందారు. ఘటనపై తమకు ఎలాంటి సమాచారం అందలేదని పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ బస్ ఢీకొని వ్యక్తి మృతి



ఘటనా స్థలిలో చిరంజీవిరావు మృతదేహం

సీతానగరం: మండలంలోని కాటవరానికి చెందిన కాట్రగడ్డ చిరంజీవిరావు (58) ఆర్టీసీ బస్ ఢీకొని మృతి చెందారు. శుక్రవారం తెల్లవారు జామున 5.30 గంటలకు కాటవరం నుంచి మునికూడలి వైపునకు వాకింగ్ చేస్తున్న చిరంజీవిరావును ఇసుక ర్యాంపు దగ్గరలో ఆర్టీసీ బస్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మరణించారు. కొంత కాలంగా పక్షవాతంతో బాధపడుతున్న మృతుడు చిరంజీవిరావు ఉదయం నడకకు వెళుతుంటారు. రోజూ మాదిరిగా నడకకు వెళ్లిన చిరంజీవిరావు.. కొంత దూరం వెళ్లిన అనంతరం డివైడర్‌పై కొద్దిసేపు కూర్చున్నారు. తిరిగి నడుస్తుండగా ఆర్టీసీ బస్ ఢీకొంది. మృతునికి భార్య, అమెరికాలో కుమారుడు ఉన్నారు. సమాచారం అందుకున్న ఎస్సై టి.రామకృష్ణ పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని సోదరుడు కాట్రగడ్డ సూర్యచంద్రరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రామకృష్ణ తెలిపారు

కోనసీమ రూపశిల్పి కళా వెంకట్రావు

- ద్రోణాచార్యుడిలా స్వాతంత్య్ర ఉద్యమంలో కీలక పాత్ర
- ఆంధ్రా పటేల్‌గా కీర్తి
- ఎన్నో ఏళ్ల జైలు జీవితం
- కొత్తపేట తొలి ఎమ్మెల్యే, నియోజకవర్గ చరిత్రలో ఏకైక మంత్రి

కొత్తపేట: ఈ తరం రాజకీయ నాయకుల గురించి అందరికీ తెలిసిందే. రోజూ టీవీలు, పేపర్లు, సోషల్ మీడియాలో చూస్తూనే ఉన్నాం. అయితే పూర్వకాలంలో ప్రజాప్రతినిధులు ఏ విధంగా ఉండేవారు, వారిని ప్రజలు ఎలా ఆదరించారు అనే విషయాలు తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. కులాలు, మతాలతో సంబంధం లేకుండా నీతి నిజాయితీపరులకు నాటి ప్రజలు పట్టం కట్టేవారు. దేశం కోసం పోరాడి జైలు జీవితం గడిపిన వారికి పాలనా పగ్గాలు అప్పజెప్పేవారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అటువంటి నాయకులు పలువురు ఉన్నారు. వారిలో కోనసీమ రూపశిల్పిగా ఖ్యాతి గడించిన కళా వెంకటరావు ఒకరు.

ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో కూడా మంత్రి పదవులు

మద్రాసు ప్రెసిడెన్సీలో కూడా కళా వెంకట్రావు మంత్రి పదవి చేపట్టారు. 1946లో అమలాపురం నుంచి గెలుపొందిన ఆయన 1947లో ఒమండూరు రామస్వామి రెడ్డియార్ మంత్రివర్గంలో రెవెన్యూ మంత్రిగా చోటు సంపాదించుకుని స్వాతంత్య్రం అనంతరం తొలి రెవెన్యూ మంత్రిగా రికార్డులకు ఎక్కారు. ఆ కాలంలోనే జమీందారీ చట్టం రద్దుకు వెంకట్రావు కృషి చేశారు. 1950లో రావులపాలెం,

గుర్తుండిపోయే సేవలు

అప్పట్లో కొత్తగా ఏర్పడిన కొత్తపేట నియోజకవర్గానికి తొలి ఎమ్మెల్యేగా గెలిచి, కీలకమైన ఆర్థిక శాఖతో పాటు పలు శాఖలతో మంత్రి పదవిని చేపట్టారు కళా వెంకటరావు. దురదృష్టవశాత్తూ తన 59 ఏటనే మంత్రి పదవిలో ఉండగానే గుండెపోటుతో మృతి చెందారు. ఆయన సజీవంగా లేకపోయినా చేసిన అభివృద్ధి కోనసీమ ప్రజలు ఎన్నో దశాబ్దాలుగా గుర్తు పెట్టుకుంటున్నారు. మరికొన్ని తరాలకు కూడా గుర్తుండిపోయే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. అందులో ప్రధానమైనవి గౌతమి, వశిష్ట వంతెనలు. రావుల

సిద్ధాంతం వద్ద గౌతమి, వశిష్ట వంతెనల నిర్మాణానికి విశేష కృషి చేశారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రం ఏర్పడిన తర్వాత 1951 పూసపాటి కుమారస్వామి రాజు మంత్రివర్గంలో ఆరోగ్య శాఖ మంత్రిగా పని చేశారు. 1952లో అమలాపురం నియోజవర్గం నుంచి పోటీ చేసిన ఆయన నడింపల్లి రామభద్రరాజు చేతిలో ఓటమి చెందారు. 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన తర్వాత 1955లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కొత్తగా ఏర్పడిన కొత్తపేట నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందారు. అప్పటి బెజవాడ గోపాల్‌రెడ్డి మంత్రివర్గంలో ప్రణాళిక శాఖ మంత్రిగా పని చేశారు. 1956లో నీలం సంజీవరెడ్డి మంత్రివర్గంలో ఆర్థిక, వాణిజ్య పన్నుల, భూసంస్కరణల మంత్రి పదవులు చేపట్టారు. రాజకీయాలకు అతీతంగా కోనసీమ అభివృద్ధికి కళా వెంకట్రావు విశేష కృషి చేశారు. ఆయన కీలక మంత్రి పదవులు చేపట్టడం వల్ల కోనసీమ ప్రాంతాన్ని అభివృద్ధి



కళా వెంకట్రావు

చేయడానికి అవకాశం ఏర్పడింది. అయితే, ఆయన 1959 మార్చి 28న హైదరాబాదులో గుండెపోటుతో మృతి చెందారు.

బాల్యం నుంచి పోరాట స్ఫూర్తి.. జైలు జీవితం

1900 జూలై 7న అమలాపురం సమీపంలోని ముక్కామల (ప్రస్తుతం అంబాజీపేట మండలం) గ్రామంలో బ్రాహ్మణ రైతు కుటుంబంలో జన్మించిన కళా వెంకటరావు బాల్యం నుంచే పోరాట స్ఫూర్తిని అందుకున్నారు. స్వగ్రామంలో విద్యాభ్యాసం ప్రారంభమైనప్పటికీ విజయనగరం మహారాజా కళాశాలలో బీఏ చదివారు. ఆ సమయంలోనే హోంరూల్ ఉద్యమ ప్రభావానికి లోనయ్యారు. కళాశాల రాజకీయాలు, స్థానిక రాజకీయాల్లో పాల్గొన్నందుకు వెంకట్రావును కళాశాల నుంచి బహిష్కరించారు. సహాయ నిరాకరణ ఉద్యమంలో భాగంగా పన్ను చెల్లించవద్దని రైతులకు ప్రబోధించినందుకు 1922 జనవరి నుంచి ఏడాది పాటు

పాలెం – జొన్నాడ మధ్య గౌతమీ గోదావరిపై, తూర్పు గోదావరిలో గోపాలపురం – పశ్చిమ గోదావరిలో సిద్ధాంతం మధ్య వశిష్ట గోదావరిపై వశిష్ట వారధి నిర్మాణం. అప్పటి వరకూ పడవలపై రాకపోకలు సాగించే కోనసీమ వాసులకు బాహ్య ప్రపంచాన్ని పరిచయం చేశారు. రావులపాలెం, సిద్ధాంతం బ్రిడ్జిలు వారి అభివృద్ధికి నిచ్చెనలుగా మారాయి. అందుకునే రావులపాలెం ముఖ్య కూడలిలో పాలకులు కళా వెంకటరావు విగ్రహం నెలకొల్పారు. దానితో ఆ ప్రాంతం కళా వెంకట్రావు సెంటర్‌గా ప్రాచుర్యం పొందింది.

అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం కారాగార శిక్ష విధించింది. 1929లో సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా ఉద్యమం నడిపి మరో ఏడాది జైలు శిక్ష అనుభవించారు. అనంతరం అమలాపురంలో సత్యాగ్రహ ఉద్యమానికి నాయకత్వం వహించినందుకు ఆరు నెలలు జైలు పాలయ్యారు. 1942లో ఏకంగా మూడేళ్ల పాటు జైలు శిక్ష అనుభవించారు.

స్వాతంత్య్ర ఉద్యమంలో ద్రోణాచార్యునిగా గుర్తింపు

స్వాతంత్య్ర ఉద్యమంలో కళా వెంకట్రావును ద్రోణాచార్యునిగా పిలిచేవారు. ఆయన పోరాట పటిమ ఎందరినో ఆకర్షించింది. ఆంధ్రా పటేల్‌గా కీర్తి పొందడానికి కారణమైంది. ×ఆంధ్ర సర్క్యులర్ రచన ద్వారా స్వాతంత్య్ర సమరాన్ని తీవ్రతరం చేసిన అపర చాణక్యుడు కళా వెంకట్రావు. సహాయ నిరాకరణ ఉద్యమంలోనే కాకుండా సహకారోద్యమంలోనూ ఆయన పాల్గొన్నారు. మహర్షి బులుసు సాం

బమూర్తి శిక్షణలో రాజకీయ నైపుణ్యం సంతరించుకుని ప్రకాశం పంతులును గురువుగా స్వీకరించి రాష్ట్ర అభివృద్ధికి విశేష కృషి చేశారు. జమీందారీ వ్యవస్థను రద్దు చేయడంలో, విద్యాలయాలు నెలకొల్పడంలో ఆయన చేసిన కృషికి జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది.

కాంగ్రెస్‌లో కీలక నేతగా..

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో అనేక పదవులు నిర్వహించిన కళా వెంకట్రావు గొప్ప వక్తగా, స్నేహశీలిగా పేరొందారు. ఉమ్మడి మద్రాసు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిల్లో కాంగ్రెస్ పార్టీకి కీలకంగా పని చేశారు. 1939 – 46 మధ్య రాష్ట్ర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా, 1947లో జాతీయ కాంగ్రెస్ సంయుక్త కార్యదర్శిగా, 1949 – 51 మధ్య ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. మద్రాసు ప్రెసిడెన్సీ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో పిఠాపురం యువరాజుతో పోటీ పడి శాసనసభకు మొదటిసారిగా ఎన్నికయ్యారు. ఆంధ్ర రాష్ట్ర నిర్మాణానికి కృషి చేశారు. అప్పట్లో రాష్ట్ర అభివృద్ధికి జరిగిన అనేక నిర్ణయాల్లో ముఖ్యపాత్ర పోషించారు. విశాఖలో కాల్టెక్స్ నూనెశుద్ధి కర్మాగారం, అమలాపురంలో కోనసీమ భానోజీ రామర్స్ కళాశాల స్థాపన, అమలాపురంలో కోనసీమ సెంట్రల్ బ్యాంకు ఏర్పాటులో ముఖ్యపాత్ర పోషించారు. సెంట్రల్ బ్యాంకు భవనాన్ని తన కార్యక్రమాలకు కేంద్ర స్థానంగా చేసుకున్నారు. కొత్తపేట నియోజకవర్గ చరిత్రలో కళా వెంకట్రావు తరువాత నేటి వరకూ ఎమ్మెల్యేలుగా ఎన్నికైన ఆరుగురిలో ఏ ఒక్కరికీ మంత్రి పదవి దక్కకపోవడం విశేషం.

ప్రధాని పర్యటనతో 6న ట్రాఫిక్ మళ్లింపు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రధాని నరేంద్రమోదీ ఈ నెల 6వ తేదీన తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ పి.జగదీష్ శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. కడియం మండలం వేమగిరి నేషనల్ హైవే సమీపంలో ప్రధాని బహిరంగ సభ జరుగుతుందని, ఉదయం 6 గంటల నుంచి ట్రాఫిక్ మళ్లిస్తామని ఎస్పీ తెలిపారు.

విశాఖపట్నం వైపు నుంచి విజయవాడ వెళ్లే వాహనాలకు...

- కత్తిపూడి వైపు నుంచి వచ్చే వాహనాలు పిఠాపురం, కాకినాడ, రామచంద్రపురం, జొన్నాడ మీదుగా విజయవాడ వెళ్లాలి.
- జగ్గంపేట మీదుగా వెళ్లే వాహనాలు సామర్లకోట, కాకినాడ, రామచంద్రపురం, జొన్నాడ మీదుగా వెళ్లాలి.

విజయవాడ నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే వాహనాలకు...

- గుండుగొలను వైపు నుంచి వచ్చే వాహనాలు నల్లజర్ల, దేవరపల్లి, గామన్ బ్రిడ్జ్ మీదుగా విశాఖపట్నం వెళ్లాలి.
- తాడేపల్లిగూడెం వైపు నుంచి వచ్చే వాహనాలు నల్లజర్ల, దేవరపల్లి, గామన్ బ్రిడ్జ్ మీదుగా వెళ్లాలి.
- జొన్నాడ వైపు నుంచి వచ్చే వాహనాలు మండపేట, రామచంద్రపురం, కాకినాడ, కత్తిపూడి మీదుగా వెళ్లాలి.

వేమగిరి మీదుగా వచ్చి, వెళ్లే వాహనాలకు...

- విశాఖ నుంచి వచ్చే వాహనాలు గామన్ బ్రిడ్జి, దేవరపల్లి మీదుగా విజయవాడ వెళ్లాలి.
- విశాఖ నుంచి వచ్చే వాహనాలు గామన్ బ్రిడ్జి, కొవ్వూరు, విజ్జేశ్వరం, పెరవలి, రావులపాలెం మీదుగా కూడా విజయవాడ వెళ్లవచ్చు.
- రాజానగరం, ద్వారపూడి, మండపేట, ఆలమూరు, జొన్నాడ, రావులపాలెం మీదుగా విజయవాడ వెళ్లాలి.
- వేమగిరి, ధవళేశ్వరం, ఐఎల్‌టీడీ జంక్షన్, కోటిపల్లి బస్టాండ్ మీదుగా వెళ్లాలి.
- వేమగిరి, కేశవరం, ద్వారపూడి, మండపేట, రామచంద్రపురం మీదుగా కాకినాడ వెళ్లాలి.
- పెరవలి జంక్షన్, సమిశ్రగూడెం, విజ్జేశ్వరం, కొవ్వూరు, గామన్ బ్రిడ్జి మీదుగా విశాఖ వెళ్లాలి.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామానికి చెందిన పెరుమళ్ల సురేష్(36) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్సై పి.బుజ్జిబాబు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అతని భార్య మరియమ్మ ఇచ్చిన సమాచారం మేరకు వీరికి 12 ఏళ్ల క్రితం వివాహం జరిగిందన్నారు. ఒక అమ్మాయి, ఒక అబ్బాయి ఉన్నారని తెలిపారు. కొంతకాలంగా తాగుడుకు బానిస అయి కుటుంబాన్ని పట్టించుకోవడం లేదు. దీంతో భార్య అతనికి దూరంగా ఉంటోందన్నారు. శుక్రవారం మధ్యాహ్నం గ్రామంలో కనిపించి తన ఆధార్‌కార్డు, ఇవ్వమని భార్యను అడగగా.. నేను పనికి వెళుతున్నానని సాయంత్రం ఇస్తాను అని చెప్పిందన్నారు. ఇంటి దగ్గర ఉన్న ఖాళీ స్థలంలో ఉరి వేసుకుని ఉన్నాడని స్థానికులు చెప్పడంతో వెళ్లి చూడగా మరణించి ఉన్నాడన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. మృతదేహాన్ని అనపర్తి సీహెచ్‌సీకి తరలించి అతని భార్య ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

ఉభయ గోదావరి జిల్లాల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి

- సీఎం జగన్ పాలనపై అవగాహన కల్పిస్తాం
- వైఎస్సార్ సీపీ ఎన్‌ఆర్‌ఐ వింగ్ బస్సు యాత్ర ఇన్‌చార్జి కార్తీక్ యల్లాప్రగడ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఎన్‌ఆర్‌ఐ వింగ్ సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: ఉభయగోదావరి జిల్లాల్లో వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని ఆ పార్టీ ఎన్‌ఆర్‌ఐ వింగ్ యూరప్ కన్వీనర్, ఉభయగోదావరి ఎన్‌ఆర్‌ఐ బస్సు యాత్ర ఇన్‌చార్జి కార్తీక్ యల్లాప్రగడ అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లపాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు, ఇటీవల విడుదల చేసిన మేనిఫెస్టో, సీఎం జగన్ పాలనపై టీడీపీ, జనసేన, ఎల్లో మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని డాక్యుమెంట్స్, డేటాతో కూడిన పూర్తి ఆధారాలతో తిప్పికొడతామన్నారు. శుక్రవారం ఇన్నీసుపేటలోని మహాకాళేశ్వరాలయంలో వైఎస్సార్ సీపీ ఎన్‌ఆర్‌ఐ వింగ్ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడ నుంచి బస్సుయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్తీక్ యల్లాప్రగడ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ఎన్‌ఆర్‌ఐ వింగ్ నాలుగు బృందాలు రాయలసీమ, కృష్ణా, గుంటూరు, ఉభయగోదావరి, కోస్తాంధ్రలలో బస్సు యాత్ర నిర్వహిస్తున్నాయన్నారు. ఈ బస్సుయాత్రల్లో ఎన్‌ఆర్‌ఐ వింగ్ సభ్యులు ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల కోసం ప్రచారం నిర్వహించి, ×వై ఏపీ నీడ్స్ జగన్‌×పై ప్రజలకు పూర్తి అవగాహన కల్పిస్తారన్నారు. న్యాయవాదులు, ఇంజినీర్లు, వైద్యులు మేధావులను కలిసి సీఎం జగన్ ఐదేళ్లు చేసిన అభివృద్ధితో పాటు, టీడీపీ, ఎల్లో మీడియా చేస్తున్న దుష్ప్రచారంపై వాస్తవాలు వివరిస్తామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో రెండేళ్లకు పైగా కరోనా వల్ల పోయిందని, కేవలం రెండేళ్లు మాత్రమే పూర్తిస్థాయిలో సీఎం జగన్ పాలించడానికి వీలయిందన్నారు. రాష్ట్రంలో స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) 17శాతానికి పెరిగిందని, పేదరికం 12శాతం నుంచి 4.2శాతానికి తగ్గిందని ఆర్‌బీఐ, నీతిఅయోగ్ గణాంకాలు పేర్కొన్నాయన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల ద్వారా ఏడాదికి రూ.70వేల కోట్లు ఖర్చుపెడితే టీడీపీ, పచ్చమీడియా వెనిజుల్లా, శ్రీలంక అయిపోతుందని గగ్గోలు పెట్టారన్నారు. ఇప్పుడు చంద్రబాబు అండ్ కో చెప్పే సూపర్ సిక్స్ పథకాలతో పాటు, తప్పనిసరిగా అమలు చేయాల్సిన పథకాలను కలిపితే ఏడాదికి రూ.1.57 లక్షల కోట్లు ఖర్చువుతుందన్నారు. సూపర్‌సిక్స్‌తో టీడీపీ క్లోజ్ అవ్వడం ఖాయమన్నారు. సంపద సృష్టిస్తానని చంద్రబాబు చెబుతున్నారని ఆయన పాలనలో 1,300 కోట్ల లోటు బడ్జెట్ ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా విశాఖపట్నం అనువైందని, 10శాతం జీడీపీ కలిగి ఉందన్నారు. పదిరోజుల పాటు వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయంతో పాటు మరోసారి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవడానికి ఎన్‌ఆర్‌ఐ టీమ్ పూర్తి స్థాయిలో కృషి చేస్తుందని కార్తీక యల్లాప్రగడ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ నేత టీకే విశ్వేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ స్విట్జర్లాండ్ కోఆర్డినేటర్ భావిగడ్డ బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్ సీపీ నెదర్లాండ్స్ కోఆర్డినేటర్ సారధిరెడ్డి వంగా, వినోద్‌పేరూరి(ఐర్లాండ్), కిషోర్ యాదవ్ తనిమిడి(ఇటలీ), కుమారస్వామి(కువైట్), వెంకటరామయ్య(దుబాయ్), కామేష్ తాతపూడి(జర్మనీ) పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల అభ్యున్నతికి సహకారం

– ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



ఆత్మీయ సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్సీ తోట, నాయకులు

మండపేట: నియోజకవర్గంలో వుండే నాయీ బ్రాహ్మణుల అభ్యున్నతికి తన వంతు సహకారం అందిస్తానని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. పట్టణంలోని శ్రీ సీతారామా కమ్యూనిటీ హాలులో శుక్రవారం నాయీ బ్రాహ్మణుల ఆత్మీయ సదస్సు జరిగింది. నాయీ బ్రాహ్మణుల సంఘం అధ్యక్షుడు మల్లువలస గణపతి అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు బీసీలు అంటే ఇష్టం వుండదన్నారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానంలో నాయీ బ్రాహ్మణులను ఆలయ ధర్మకర్త ఒకరు దూషించారన్నారు. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా నాయీబ్రాహ్మణులు ఆందోళన చేశారన్నారు. ఈ విషయంపై సచివాలయంలో నాయీబ్రాహ్మణుల సంఘాల ప్రతినిధులు చంద్రబాబు వద్దకు వెళ్తే ఎందుకొచ్చారంటూ పొమ్మన్నారని, మీ తోకలు కత్తిరిస్తానని వారిని దూషించారని తెలిపారు. తాతపూడి సర్పంచ్ విన్నేటి సత్యనారాయణ తమ సంఘ ప్రతినిధులతో నియోజకవర్గంలో నాయీబ్రాహ్మణుల సమస్యలు వివరించగా ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు వెటకారంగా మీక్కూడా సంఘాలు ఉంటాయా అని దుర్భాషలాడారని అన్నారు. సంఘ నాయకుడు ఇంటూరి బాబ్జినంద, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, సీనియర్ నాయకుడు రెడ్డి రాజబాబు, వైస్ చైర్మన్ వేగుళ్ళ నారాయణరావు, గారపాటి అశోక్, పిల్లా వీరబాబు, సుందరపల్లి వెంకటేశ్వరరావు, బైలపూడి రామకృష్ణ పాల్గొన్నారు.

అరటి తోట దగ్ధం

కిర్లంపూడి: మండల పరిధి సోమవరంలో 1.50 ఎకరాల ఆయిల్‌పామ్, అరటి, జామాయిల్ తోట దగ్ధమైనట్టు జగ్గంపేట అగ్నిమాపక అధికారి లక్ష్మణరావు తెలిపారు. పులగం వెంకటరెడ్డికి చెందిన పొలంలో గుర్తుతెలియని వ్యక్తి నిర్లక్ష్యపు ధూమపానం వల్ల అగ్నిప్రమాదం జరిగింది. దీంతో స్థానికులు ఇచ్చిన సమాచారంతో సిబ్బందితో వెళ్లి మంటలను అదుపు చేసినట్లు లక్ష్మణరావు తెలిపారు. సుమారు లక్ష రూపాయల ఆస్తినష్టం జరిగినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రత్తిపాడు: జాతీయ రహదారిపై ధర్మవరం గ్రామ శివారులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక పోలీసుల కథనం మేరకు గొల్లప్రోలు మండలం వన్నెపూడి గ్రామానికి చెందిన గ్రంధి వెంకట రామకృష్ణ బైక్‌పై కత్తిపూడి నుంచి ధర్మవరం వైపు వస్తున్నాడు. ధర్మవరం శివారు ప్రాంతానికి వచ్చేసరికి అప్పటి వరకు రోడ్డు పక్క నిలిపి ఉంచిన కంటైనర్ లారీని డ్రైవర్ అజాగ్రత్తగా రోడ్డుపైకి మళ్లించి, బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన గ్రంధి వెంకట రామకృష్ణను స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రత్తిపాడు ఎస్సై ఎం.పవన్‌కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

శెట్టిబలిజ సంఘీయుల మధ్య చిచ్చు రేపొద్దు

వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ నాయకుడు తాతాజీ



విలేకరులతో మాట్లాడుతున్న వాసంశెట్టి తాతాజీ

అయినవిల్లి: సార్వత్రిక ఎన్నికల్లో శెట్టి బలిజ సంఘీయుల ఓట్లు కూటమికి వేయాలని రామచంద్రపురం నియోజక వర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ పిలుపునివ్వడంపై అయినవిల్లి మండల శెట్టిబలిజ సంఘీయులు మండిపడ్డారు. శుక్రవారం అయినవిల్లి మండలం శంకరాయగూడెంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ నాయకుడు వాసంశెట్టి తాతాజీ అధ్యక్షతన శెట్టి బలిజ సంఘీయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తాతాజీ స్థానిక విలేకరుతో మాట్లాడుతూ వాసంశెట్టి సుభాష్ తన వ్యక్తిగత లబ్ధి కోసం శెట్టిబలిజ సంఘీయుల మధ్య చిచ్చు రేపుతున్నారన్నారు. కోనసీమ అల్లర్ల నేపథ్యంలో ఎస్సీ, బీసీల మధ్య చిచ్చు రేపింది సుభాష్ అన్నారు. సుభాష్ రామచంద్రపురం నియోజకవర్గంలోని శెట్టిబలిజ సంఘీయుల ఓట్లు అభ్యర్థించుకోవాలే తప్ప మిగిలిన నియోజకవర్గాల్లోని కూటమి అభ్యర్థులకే ఓటు వేయాలని అడగడం ఎంత వరకూ సబబు అన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ శెట్టిబలిజ కులస్తులకు ప్రాధాన్యం ఇవ్వలేదన్నారు. రాజకీయంగా శెట్టిబలిజ సంఘీయులను అణగదొక్కారన్నారు. ఆ పార్టీల్లో బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరగలేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శెట్టిబలిజ సంఘీయులకు అధిక ప్రాధాన్యం కల్పించారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే శెట్టి బలిజ సంఘీయులు రుణపడి ఉన్నారన్నారు. శెట్టి బలిజ సంఘీయులు ఓట్లు వేయాల్సి వస్తే వైఎస్సార్ సీపీకే వేసి గెలిపించుకోవాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో శెట్టిబలిజ కులస్తులకు ఒక రాజ్యసభ సీటు, రెండు ఎమ్మెల్సీలు, రెండు ఎంపీ సీట్లు, అయిదు ఎమ్మెల్యే సీట్లు ఇచ్చిన సంగతి సుభాష్‌కు తెలియదా అని ప్రశ్నించారు. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తమ ఉనికి కాపాడుకోవడం కోసమే పార్టీలు నడుపుతున్నారన్నారు. శెట్టిబలిజ సంఘీయులు ఓట్లు అడగడానికి వారికి సిగ్గు ఉండాలన్నారు. అయినవిల్లి ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు రమణాతి వెంకటలక్ష్మి, సంఘ నాయకులు పితాని నరసింహారావు, కుడుపూడి రామకృష్ణ, మేడిశెట్టి శ్రీనివాస్, కదలి భూపతిరావు, మట్టపర్తి వెంకటరమణ, దొమ్మేటి సూర్య, కామన కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నగదు, మద్యం స్వాధీనం

అమలాపురం టౌన్: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా అక్రమ రవాణాను అడ్డుకునేందుకు నిఘా బృందాలు దాడులు, తనిఖీలు నిర్వహించి మద్యాన్ని స్వాధీనం చేసుకుంటున్నాయి. నగదును సీజ్ చేస్తున్నాయి. జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా ఆధ్వర్యంలో జిల్లాలో గురు, శుక్రవారాల్లో పట్టుబడ్డ మద్యం, నగదు వివరాలను జిల్లా ఎస్పీ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

- కాట్రేనికోన మండలం బలుసుతిప్ప గ్రామంలో ప్రజలకు పోలీసు అధికారులు ఎన్నికలపై అవగాహన సదస్సు నిర్వహించారు.
- జిల్లాలో 17 కేసులు నమోదు చేసి 19 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 2 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 115 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 32.95 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్, 64 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. 100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.
- మండపేటలో నిఘా బృందాలు చెక్ పోస్టులో వాహనాలను తనిఖీ చేసి రూ.2.50 లక్షల నగదును సీజ్ చేశారు.
- మండపేట రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో రూ.90 వేల నగదు సీజ్ చేశారు.
- ఉప్పలగుప్తం పోలీసు స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి అతని నుంచి 30 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 5.4 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు.



మండపేట ప్రాంతంలో తనిఖీల్లో పట్టుబడ్డ నగదును లెక్కిస్తున్న నిఘా బృందాల ప్రతినిధులు

- కాట్రేనికోన పోలీసు స్టేషన్ పరిధిలోని బలుసుతిప్ప నిఘా బృందాలు తనిఖీలు చేసి రికార్డులు సరిగా లేని 20 మోటారు సైకిళ్లు, ఒక ఆటో సీజ్ చేశారు.
- తాళ్లరేవు మండలంలో పోలీస్ ఎన్నికల పరిశీలకుడు ఎంపీ చంద్రకాంత్, ద్రాక్షారామ పోలీసు స్టేషన్ పరిధిలో ఎన్నికల పరిశీలకుడు పరదీప్‌కుమార్ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు.
- ద్రాక్షారామ పోలీసు స్టేషన్ పరిధిలో వెంకటాయపాలెం, బాపనయ్య చెరువు, పామర్రు పోలీసు స్టేషన్ పరిధిలో పేకేరు, తాళ్లపొడు, బట్లపాలిక గ్రామాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల ప్రాంతాల్లో పోలీసు అధికారులు కేంద్ర బలగాలతో కలిసి శుక్రవారం సాయంత్రం కవాతు నిర్వహించారు.

రైల్వే స్టేషన్లో రెండు బ్యాటరీ వాహనాల ఏర్పాటు

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం ప్రధాన రైల్వే స్టేషన్లో రాకపోకలు సాగించే ప్రయాణికుల సౌకర్యం కోసం టికెట్ ప్రాతిపదికపై రెండు బ్యాటరీ వాహనాలను రైల్వేశాఖ ఏర్పాటు చేసింది. శుక్రవారం మొదటి విడతగా ఒక వాహనానికి పూజా కార్యక్రమాన్ని కాంట్రాక్టర్ రామాంజనేయులు నిర్వహించారు. మనిషికి 50 రూపాయల చొప్పున రైల్వే స్టేషన్ మెయిన్ గేట్ నుంచి స్టేషన్లో గల ఏ ప్లాట్ ఫామ్‌కు వెళ్లాలన్నా వసూలు చేయనున్నారు. రైల్వేస్టేషన్లో రెండు బ్యాటరీ వాహనాలను రైల్వే అధికారులు మూడేళ్ల కాంట్రాక్టు పరిమితితో ఏర్పాటు చేశారు. ఈ వాహనాలు 24 గంటలూ ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయి. కాగా తమ జీవనోపాధికి ఈ వాహనాలు గండి కొట్టే పరిస్థితి ఏర్పడిందని 19 మంది రైల్వే పోర్టర్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



బ్యాటరీ వెహికల్